# బిజినెస్

# సిస్కోలో 6,000 మందిపై వేటు

## ఎస్‌బిఐ రుణాలు మరింత ప్రియం




**న్యూఢిల్లీ :** అధిక వడ్డీ రేట్లతో ఇప్పటికే ఒత్తిడిలో ఉన్న రుణగ్రహీతలపై స్టేట్ బ్యాంక్ మరింత భారం వేయనుంది. దేశంలో దిగ్గజ విత్త సంస్థ ఎస్‌బిఐ తాజాగా రుణాలపై వడ్డీ రేట్లను 10 బేసిస్ పాయింట్లు పెంచింది. దీంతో వరుసగా మూడో మాసంలోనూ వడ్డీ రేట్లు పెంచినట్లయ్యింది. తాజాగా సవరించిన వడ్డీ రేట్లు ఆగస్టు 15 నుంచి అమలులోకి వచ్చాయి. మూడేళ్ల కాలవ్యవధికి ఎస్‌బిఐ మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ బేస్డ్ లెండింగ్ రేట్ (ఎంసిఎల్‌ఆర్) 9.10 శాతానికి పెరిగింది. ఇంతకుముందు ఇది తొమ్మిది శాతంగా ఉంది. ఎంసిఎల్‌ఆర్ అనేది ఒక బ్యాంకు రుణాలపై వసూలు చేసే కనీస వడ్డీ రేటు. దీని కంటే తక్కువ వడ్డీ రేటుతో బ్యాంకులు రుణాలు ఇవ్వలేవు. ఇక ఓవర్‌నైట్ ఎంసిఎల్‌ఆర్‌ను 8.10 శాతం నుంచి 8.20 శాతానికి చేర్చింది. నెల, మూడు నెలల కాల వ్యవధులకు లెండింగ్ రేటు 8.45 శాతం నుంచి 8.5 శాతానికి చేర్చింది. ఆరు నెలల ఎంసిఎల్‌ఆర్ 8.85 శాతానికి, ఏడాది లెండింగ్ రేటు 8.85 నుంచి 8.95 శాతానికి, రెండేళ్ల ఎంసిఎల్‌ఆర్ 9.05 శాతానికి, మూడేళ్ల ఎంసిఎల్‌ఆర్ 9.1 శాతానికి పెంచుతూ ఎస్‌బిఐ నిర్ణయం తీసుకుంది. ఎస్‌బిఐ గత జూన్ నుంచి కొన్ని టెన్యూర్‌లలో 30 బేసిస్ పాయింట్ల (0.30 శాతం) వరకు ఎంసిఎల్‌ఆర్‌ను పెంచింది. తాజాగా సవరించిన వడ్డీ రేట్లతో సిబిల్ స్కోర్ ఆధారంగా గృహ, వాహన, రిటైల్, వ్యక్తిగత రుణాలపై 8.50 శాతం నుంచి 9.65 శాతం వరకు రేట్లను వసూలు చేయనుంది.

## ఎట్టకేలకు లాంచ్ అయిన మహీంద్రా థార్ రోక్స్




తాజాగా మహీంద్రా థార్ రోక్స్ ఎస్‌యూవీని ఆగస్టు 14 న లాంచ్ అయిన విషయం తెలిసిందే. ముందుగా అనౌన్స్ చేసిన తేదీ కంటే ఒక రోజు ముందుగానే ఈ సూపర్ స్టైలిష్ కారును భారత మార్కెట్లోకి విడుదల చేసింది. ఈ 5-డోర్ల వెర్షన్ ఎంట్రీ లెవల్ ఎంఎక్స్ 1 పెట్రోల్ ప్రారంభ ధర రూ .12.99 లక్షలుగా ఉంది. అదే సమయంలో ఎంఎక్స్ 1 డీజిల్ వేరియంట్ ప్రారంభ ధర రూ .13.99 లక్షలుగా ఉంది. ఇక మూడు డోర్ల మోడల్ కంటే డీజిల్ వేరియంట్ ధర రూ. 1.64 లక్షలు ఎక్కువగా ఉంది. కాగా మహీంద్రా థార్ రోక్స్ అన్ని వేరియంట్ల జాబితాను ఆగస్టు 15 వెల్లడించారు. అలాగే వేరియంట్ల వారీగా ధరలను కూడా ప్రకటించారు. కంపెనీ తన బేస్ వేరియంట్ ఎంఎక్స్ 1 ఫీచర్లకు తెర తీసింది. ఇందులో చాలా గొప్ప గొప్ప ఫీచర్లు ఉన్నాయి. మహీంద్రా థార్ రోక్స్ లో స్ట్రాంగ్ సేఫ్టీ ఫీచర్స్ కూడా అందుబాటులోకి రానున్నాయి. కంపెనీ ఇంకా దాని అన్ని ఫీచర్లను ఆవిష్కరించలేదు. కానీ బయటకు వచ్చిన వివరాలన్నీ దీనిని బలమైన ఎస్‌యూవీగా కనిపిస్తుంది. మహీంద్రా థార్ రోక్స్ సేఫ్టీ ఫీచర్లకు సంబంధించి కెమెరా ఆధారిత లెవల్2 ఏడీఏఎస్ సూట్ ను అందించారు. నాలుగు చక్రాలకు డిస్క్ బ్రేకులు, 6 ఎయిర్ బ్యాగులు, ప్రయాణీకులందరికీ 3 పాయింట్ల సీటు బెల్టులు, టీసీఎస్, టిపిఎంఎస్, ఈఎస్పి లాంటి ఇతర భద్రతా ఫీచర్లు సైతం ఇందులో అందించారు. ఆఫ్ రోడింగ్ ను సులభతరం చేయడానికి, మహీంద్రా క్రాల్ స్మార్ట్ అసిస్ట్, ఇంటెల్లీ టర్న్ అసిస్ట్ తో పాటు ఎలక్ట్రానిక్ గా లాక్ చేయగల వ్యత్యాసాన్ని కూడా అందిస్తోంది.

టెక్నాలజీ కంపెనీల్లో ఉద్యోగాలకు భద్రత కరువయ్యింది. పొదుపు చర్యల్లో భాగంగా వరుసగా ఉద్వాసనలకు పాల్పడుతున్నాయి. అమెరికా ఆర్థిక వ్యవస్థలో మందగమనం సంకేతాలకు తోడు కృత్రిమ మేధా (ఎఐ)పై దృష్టి సారిస్తున్న నేపథ్యంలో కోతలకు పాల్పడుతున్నాయి. ఈ క్రమంలోనే తాజాగా అమెరికన్ టెక్ దిగ్గజం సిస్కో దాదాపు 6,000 మంది ఉద్యోగులపై వేటు వేసింది. దీంతో 2024లో రెండో సారి తొలగింపులకు పాల్పడినట్లయ్యింది. ఇంతక్రితం గడిచిన ఫిబ్రవరిలో 4,000 మందికి ఉద్వాసన పలికింది. సిస్కో తన గ్లోబల్ వర్క్‌ఫోర్స్‌లో ఏడు శాతం ఉద్యోగులను తగ్గించాలని యోచించినట్లు ఆ కంపెనీ తాజాగా యుఎస్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజీ కమిషన్ (ఎస్ఇసి) చేసిన ఫైలింగ్‌లో వెల్లడించింది. కీలక వృద్ధి అవకాశాలలో పెట్టుబడి పెట్టడానికి, వ్యాపారంలో మరింత సామర్థ్యాలను పెంచుకోవడానికి పునర్నిర్మాణ ప్రణాళికను చేపట్టనున్నట్లు పేర్కొంది. ఈ నేపథ్యంలోనే ఉద్యోగులను ఇంటికి పంపిస్తోన్నట్లు వెల్లడించింది. ఇది తమ మొత్తం ఉద్యోగుల్లో ఏడు శాతానికి సమానమని




తెలిపింది. ఉద్వాసనలు సహా ఇతర పొదుపు చర్యల ద్వారా ఒక్క బిలియన్ డాలర్లు (దాదాపు రూ. 8300 కోట్లు) ఖర్చులను తగ్గించుకోవాలని నిర్ణయించినట్లు ఎస్ఇసికి సిస్కో సమాచారం ఇచ్చింది. ఎఐ స్టార్టప్‌ల్లో ఒక్క బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు పేర్కొంది. ఎన్‌విడియాతో కలిసి ఎఐ సిస్టమ్స్‌ను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపింది. సైబర్ సెక్యూరిటీపై కూడా కీలక దృష్టి సారించినట్లు వెల్లడించింది. 2024 ప్రారంభం నుంచి టెక్ పరిశ్రమల్లో వేగంగా ఉద్వాసనలు కొనసాగుతున్నాయి. ఈ నెల ప్రారంభంలోనూ ఇంటెల్ దాదాపు 15,000 ఉద్యోగాల కోతలను ప్రకటించింది. ఇటీవలే మైక్రోసాఫ్ట్, అమెజాన్, గూగుల్ మరియు మరెన్నో సహా పెద్ద టెక్ కంపెనీలు వేల సంఖ్యలో ఉద్యోగ కోతలకు పాల్పడ్డాయి. ఈ క్రమంలోనే సిస్కో రెండో దశ ఉద్వాసనలను ప్రకటించింది. ఈ ఏడాదిలో ఇప్పటివరకూ 397 కంపెనీలు 1,30,482 మంది ఉద్యోగులను విధుల నుంచి తొలగించాయని లేఆఫ్స్.ఎఫ్‌వైఐ ఇటీవల గణంకాలను వెల్లడించింది. ఉద్వాసనలు తగ్గుముఖం పట్టకపోవడంతో ఏ క్షణం తమ ఉద్యోగాలకు ఎసరు వస్తుందోనని టెకీలు తీవ్ర ఆందోళనలో ఉన్నారు.

## 8 నెలల కనిష్టానికి పడిపోయిన ఎగుమతులు

**న్యూఢిల్లీ :** దేశ ఎగుమతులు జులై నెలలో 8 నెలల కనిష్టానికి పడిపోయాయి. మూడు నెలల సానుకూల వృద్ధికి అడ్డుకట్ట వేస్తూ.. భారత దేశ వస్తువుల ఎగుమతులు జులై నెలలో 1.5 శాతానికి, 33.98 బిలియన్ డాలర్లకు పడిపోయాయి. అదే సమయంలో దిగుమతులు 7.5 శాతం పెరిగి, 7.5 బిలియన్ డాలర్లుకు చేరుకున్నాయి. దీంతో జులై నెలలో వాణిజ్యలోటు 23.7 శాతానికి చేరుకుని 23.5 బిలియన్ డాలర్ల వద్ద నిలిచింది. జూన్ నెలలో కూడా ఎగుమతులు 3.5 శాతానికి తగ్గగా, దిగుమతులు 2.3 శాతం పెరిగాయి. అంతకు ముందు నెల 21 బిలియన్ డాలర్ల అంతరం కంటే సరుకుల వాణిజ్యలోటు సుమారు 12 శాతం పెరుగుదలకు దారితీసింది. ఎగుమతుల్లో క్షీణతకు పెట్రోల్ ఉత్పత్తులే కారణమయ్యాయని మార్కెట్ విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. ఇతరదేశాలకు పంపిన ఎగుమతుల విలువ గతేడాది జులై నుండి 22.2శాతం క్షీణించి 5.2 బిలియన్లకు పడిపోయింది. దిగుమతుల బిల్లు 13.8 బిలియన్లకు చేరి, చమురు దిగుమతులలో 17.4 శాతం పెరుగుదలకు దారితీసింది. దీంతో ధరల పెరుగుదలకు కారణమైంది. అదే సమయంలో బంగారం దిగుమతులు 10.7శాతానికి తగ్గి 3.13 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. అయితే వెండి దిగుమతులు పెరుగుతూ ఉన్నాయి. 439



శాతం పెరిగి సుమారు 650 మిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. 'చమురు- బంగారం యేతర' వస్తువుల అధిక దిగుమతులు కూడా వాణిజ్యలోటుకు ఆజ్యం పోశాయి. ఎలక్ట్రానిక్స్ వంటి వినియోగ వస్తువులు 11.5 శాతం పెరగగా, పప్పులు 43 శాతం మరియు కూరగాయలు, నూనెలు 14.5 శాతం పెరిగాయి. అయితే గతేడాది 778 బిలియన్ డాలర్ల ఎగుమతుల విలువను 2024-25లో భారతదేశం అధిగమిస్తుందని వాణిజ్య కార్యదర్శి సునీల్ భర్త్వాల్ ధీమా వ్యక్తం చేశారు. సరుకుల ఎగుమతులు పెరుగుతూ, తగ్గుతూ ఉంటాయని అన్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు ఎగుమతులు 4.2 శాతంగా ఉన్నాయని, సేవల ఎగుమతులు బలంగా ఉన్నాయని స్పష్టం చేశారు.


## వంటనూనెల దిగుమతులు 1.6% తగ్గాయ్

**న్యూఢిల్లీ :** భారత వంట నూనెల దిగుమతులు కాస్త తగ్గాయి. అక్టోబరుతో ముగిసే 2023-24 మార్కెటింగ్ సంవత్సరం తొలి తొమ్మిది నెలల్లో 1.6% మేర తగ్గి 119.35 లక్షల టన్నులుగా నమోదయ్యాయి. ఏడాది క్రితం ఇవి 121.22 లక్షల టన్నులుగా ఉన్నాయి. సాల్వెంట్ ఎక్స్‌ట్రాక్టర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎస్ఈఏ) గణాంకాల ప్రకారం.. వంటకు ఉపయోగించని నూనెల దిగుమతులు మాత్రం 1,32,242 టన్నుల నుంచి 1,88,955 టన్నులకు పెరిగాయి. మొత్తం వెజిటబుల్ నూనెల దిగుమతులు(వంటకు ఉపయోగించే, ఉపయోగించని నూనెలు) తొలి తొమ్మిది నెలల్లో 121.24 లక్షల టన్నులుగా నమోదయ్యాయి. క్రితం ఏడాది ఇదే సమయంలోని 122.55 లక్షల టన్నులతో పోలిస్తే ఇవి 1 శాతం తక్కువ. 2023-24 నూనెల సంవత్సరం తొలి 9 నెలల్లో (2023 నవంబరు -2024 జులైలో) మనదేశం 15,18,671 టన్నుల మేర శుద్ధి చేసిన నూనెను దిగుమతి చేసుకుంది. క్రితం ఏడాది ఇదే సమయంలోని 16,40,960 టన్నుల దిగుమతితో పోలిస్తే ఇవి 7% తక్కువ. ముడి వంటనూనెల దిగుమతులు సైతం 1,04,81,751 టన్నుల నుంచి 1,04,16,556 టన్నులకు తగ్గాయి. పామాయిల్ దిగుమతులు కూడా 4% తగ్గి 68,45,097 టన్నులకు చేరాయి. ఏ దేశాల నుంచి ఏ దిగుమతి..: ఇండొనేషియా, మలేషియాలు మనకు ఆర్‌బీడీ పామోలిన్, ముడి పామాయిల్(సీపీఓ) సరఫరా చేసే ప్రధాన దేశాలు. ముడి సోయాబీన్ నూనెను అర్జెంటీనా, బ్రెజిల్ నుంచిబీ ముడి పొద్దుతిరుగుడు పువ్వు నూనెను రష్యా, రొమేనియా, ఉక్రెయిన్, అర్జెంటీనా నుంచి తెప్పించుకుంటాం.

# పింకు బాల్ టెస్ట్ మ్యాచ్‌లకు నో ఆతిథ్యం


# స్పోర్ట్స్

భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు సెక్రటరీ జై షా తాజాగా ఒక కీలక ప్రకటన చేశారు. డే/నైట్ టెస్టులు ఎందుకు నిర్వహించడం లేదో వివరించారు. 2022లో శ్రీలంకతో బెంగళూరులో జరిగిన మ్యాచ్ తర్వాత భారతదేశంలో పింక్ బాల్ టెస్ట్ (డే/నైట్ క్రికెట్) మ్యాచ్‌లు జరగలేదు. కారణం ఈ మ్యాచ్‌లలో చాలా త్వరగా ఫలితాలు వస్తున్నాయి. అంటే, మ్యాచ్‌లు చాలా త్వరగా ముగిసిపోతున్నాయి. ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్ జట్లతో జరిగిన మ్యాచ్‌లలో కూడా పింక్ బాల్ టెస్ట్ క్రికెట్ మ్యాచ్‌లు జరగలేదు. మూడు రోజులకు నిర్వహించే పింక్ బాల్ టెస్ట్ మ్యాచ్‌లు కేవలం రెండు రోజుల్లోనే ముగిసిపోతున్నాయి. మ్యాచ్‌లు త్వరగా ముగియడం వల్ల ప్రేక్షకులు, టీవీ చూసేవారు నష్టపోతున్నారు. ఎందుకంటే, వారు మూడు రోజుల మ్యాచ్ కోసం టిక్కెట్లు కొనుగోలు చేస్తారు లేదా మూడు రోజులు చూడడానికి సిద్ధంగా



ఉంటారు. కానీ, మ్యాచ్‌లు త్వరగా ముగియడం వల్ల వారికి నష్టం వాటిల్లుతుంది. మ్యాచ్‌లు త్వరగా ముగిసినా, కొనుగోలు చేసిన టిక్కెట్లకు డబ్బు తిరిగి రాదు. ఆస్ట్రేలియాలో జరిగిన టెస్ట్ క్రికెట్ మ్యాచ్‌లో భారత జట్టు చాలా తక్కువ స్కోరు చేసి ఓడిపోయింది. బీసీసీఐ సెక్రటరీ జై షా మహిళల టీ20 ప్రపంచ కప్ గురించి మరో ముఖ్యమైన నిర్ణయం తీసుకున్నారు. బంగ్లాదేశ్‌క్రికెట్ బోర్డు, 2024లో జరగనున్న మహిళల టీ20 ప్రపంచ కప్‌ను భారతదేశంలో నిర్వహించాలని కోరింది. కానీ, భారతదేశం ఈ ప్రతిపాదనను తిరస్కరించింది. బంగ్లాదేశ్‌లో రాజకీయ పరిస్థితులు అస్థిరంగా ఉన్నాయి. భారతదేశంలో వర్షాకాలం కాలం ఉంటుంది. భారతదేశం తరువాతి సంవత్సరం మహిళల వాణ× ప్రపంచ కప్‌ను నిర్వహించనుంది. జై షా వరుసగా ప్రపంచ కప్‌లను నిర్వహించాలనే ఆలోచన లేదని చెప్పారు. బంగ్లాదేశ్‌లో అల్లర్లు జరుగుతున్న కారణంగా, అక్కడ జరగనున్న మహిళల క్రికెట్ ప్రపంచ కప్‌ను నిర్వహించాలా వద్దా అనే విషయంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు.

## స్టార్ ఆటగాళ్లతో దులీప్ ట్రోఫీ కళకళ



ప్రతిష్టాత్మక దేశవాళీ క్రికెట్ సీజన్ దులీప్ ట్రోఫీ ఈసారి సరికొత్త ఫార్మాట్‌లో జరగనుంది. గత సీజన్‌లో జోనల్ టీమ్ పద్ధతిలో ఈస్ట్, నార్త్‌జోన్‌ల పరిధిలో ఈ టోర్నమెంట్ జరగ్గా.. ఈసారి నాలుగు టీమ్‌ల మధ్య ఈ టోర్నీ జరగనుంది. 2016-17 నుంచి కొత్త ఫార్మాట్‌ను ప్రవేశపెట్టారు. ఇండియా బ్లూ, ఇండియా గ్రీన్, ఇండియా రెడ్ జట్లతో పేర్లతో రౌండ్ రాబిన్ పద్ధతిలో మ్యాచ్‌లు జరిగాయి. మొదటి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు ఫైనల్ చేరాయి. అన్ని మ్యాచ్‌లను డే/నైట్, పింక్ బాల్‌తో నిర్వహించారు. ఈ విధానంలో మూడు సీజన్‌లు జరిగాయి. 2022-23లో మళ్లీ జోనల్ టీమ్ పద్ధతిని తీసుకొచ్చారు. ఈ సారి నార్త్‌ఈస్ట్ జోన్‌ను ఆరో జోన్‌గా చేర్చారు. 2024 సీజన్ దులీప్ ట్రోఫీలో బరిలో టీమిండి యా స్టార్ ఆటగాళ్లు దిగనున్నారు. సెప్టెంబరు 5 నుంచి ప్రారంభం కానున్న ఈ టోర్నమెంట్‌లో విరాట్ కోహ్లి, రోహిత్‌శర్మ, జస్‌ప్రీత్ బుమ్రా, అశ్విన్‌లకు మినహాయింపు లభించింది. శుభ్‌మన్ గిల్, యశస్వి జైస్వాల్, సూర్యకుమార్ యాదవ్, రిషబ్ పంత్, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, మహ్మద్ సిరాజ్, శ్రేయస్, ఇషాన్ సహా ప్రధాన ఆటగాళ్లందరూ బరిలోకి దిగనున్నారు. ఈసారి నాలుగు జట్లతో దులీప్ ట్రోఫీని నిర్వహించనుంది. నాకౌట్ మ్యాచ్‌లు లేకుండా రౌండ్ రాబిన్ ఫార్మాట్‌లో నిర్వహించనుంది. ప్రతి జట్టు మిగిలిన అన్ని జట్లతో ఒక్కో మ్యాచ్ ఆడుతుంది. అన్ని మ్యాచ్‌లు ముగిసిన తర్వాత పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉన్న జట్టు విజేతగా నిలుస్తుంది. ఒక్కో మ్యాచ్ నాలుగు రోజులపాటు జరగనుంది. సెప్టెంబరు 19(చెన్నై), 27(కాన్పూర్)న బంగ్లాదేశ్‌తో ప్రారంభమయ్యే రెండు టెస్టులకు దులీప్ ట్రోఫీలో ప్రదర్శన ఆధారంగానే జట్టును ఎంపిక చేస్తామని బిసిసిఐ ప్రకటించింది.

## క్రికెట్‌ను వీడి వ్యాపారంలోకి ఎంట్రీ.. కట్‌చేస్తే



క్రికెట్‌లో తన కెరీర్‌ను ముందుకు తీసుకెళ్తేందుకు వచ్చిన ఆర్యమాన్ విక్రమ్ బిర్లా వ్యాపారవేత్తగా మారాడు. క్రికెట్‌తో పాటు వ్యాపారాలు చేస్తున్న క్రీడాకారులు ఎందరో ఉన్నారు. అయితే ఆర్యమన్ క్రికెట్ ప్రపంచాన్ని పూర్తిగా విడిచిపెట్టి విజయవంతమైన వ్యాపారవేత్తగా మారారు. వాస్తవానికి, 2019 సంవత్సరంలో, ఆర్యమాన్ మానసిక సమస్యల కారణంగా క్రికెట్ నుంచి విరామం తీసుకున్నాడు. అతను 2017-18లో మధ్యప్రదేశ్ తరపున రంజీ ట్రోఫీ అరంగేట్రం చేశాడు. %ఖూా% 2018లో రాజస్థాన్ రాయల్స్‌లో కూడా భాగమయ్యాడు. అయితే, అతను అరంగేట్రం చేసే అవకాశం పొందలేదు. ఆ తరువాత 2020 సీజన్‌కు ముందు విడుదలయ్యాడు. క్రికెట్‌కు దూరంగా ఉన్న ఆర్యమాన్ విక్రమ్ బిర్లా వ్యాపార ప్రపంచంలో తనకంటూ ఓ గుర్తింపు తెచ్చుకున్నాడు. అతను గ్రాసిమ్ ఇండస్ట్రీస్, ఆదిత్య బిర్లా ఫ్యాషన్ అండ్ రిటైల్ బోర్డులలో చేరాడు. దీనితో పాటు ముంబైలో 'జోలీస్' అనే క్లబ్‌ను కూడా ఆర్యమాన్ ప్రారంభించాడు. వివిధ రంగాలకు చెందిన వ్యక్తులు ఆర్యమాన్ క్లబ్‌కు వస్తుంటారు. ఇందులో వారు తమ ప్రయాణం గురించి చెబుతుంటారు. ఆర్యమాన్ విక్రమ్ బిర్లా 9 జులై 1997న జన్మించారు. ముంబై విశ్వవిద్యాలయం నుంచి దూరవిద్య ద్వారా వాణిజ్య శాస్త్రంలో పట్టా పొందారు. క్రికెట్‌కు విరామం ఇచ్చిన తర్వాత, అతను తన కుటుంబ వ్యాపారాన్ని నిర్వహిస్తున్నాడు. బిర్లా గ్రూప్ దేశంలోని ప్రముఖ, పురాతన పారిశ్రామిక సంస్థలలో ఒకటని తెలిసిందే. అంతే కాకుండా కుక్కలంటే చాలా ఇష్టం. అందుకే పెంపుడు కుక్కల కోసం 'పావ్‌స్టార్ కంపెనీ'ని ప్రారంభించాడు.

## బెన్ స్టోక్స్ కోచ్‌గా జట్టులోకి ఎంట్రీ..?




ఇంగ్లండ్-శ్రీలంక మధ్య మూడు టెస్టు మ్యాచ్‌ల సిరీస్ జరగనుంది. ఆగస్టు 21 నుంచి ఈ సిరీస్ ప్రారంభం కానుంది. సిరీస్ ప్రారంభానికి ముందు టీమ్ కెప్టెన్, ఆల్ రౌండర్ బెన్ స్టోక్స్ గాయపడి మొత్తం సిరీస్‌కు దూరంగా ఉండటంతో ఇంగ్లండ్ జట్టుకు పెద్ద దెబ్బ తగిలింది. ఆ తర్వాత జట్టు కమాండ్ ఒలీ పోప్‌కు అప్పగించారు. ఇప్పుడు శ్రీలంక టెస్ట్ సిరీస్‌లో బెన్ స్టోక్స్ తన జట్టుతో కొత్త పాత్రలో చేరబోతున్నాడని పెద్ద సమాచారం బయటకు వస్తోంది. ఇంగ్లండ్ టెస్ట్ కెప్టెన్ బెన్ స్టోక్స్ శ్రీలంకతో సిరీస్ ఆడడు. అతను ది హండ్రెడ్ సమయంలో స్నాయువు గాయం కారణంగా సిరీస్‌కు దూరం అయ్యాడు. అయితే ఇప్పుడు కొత్త పాత్రలో కనిపించనున్నాడు. ఇంగ్లండ్ మాజీ ఫాస్ట్ బౌలర్ స్టువర్ట్ బ్రాడ్ సమాచారం ఇస్తూ.. స్టోక్స్ కోచ్‌గా మారబోతున్నట్లు ఇప్పటికే మెసేజ్ పంపానని, బ్రెండన్ మెకల్లమ్ ఏం చేయబోతున్నాడో తెలియదా? అని పేర్కొన్నాడు. స్టోక్స్ గత ఏడాది కాలంగా బౌలింగ్ చేయలేదని, కేవలం బ్యాటింగ్ మాత్రమే చేశాడని బ్రాడ్ చెప్పాడు. శ్రీలంకతో జరిగే సిరీస్‌లో బెన్ స్టోక్స్‌కు బెటర్ ఆప్షన్ దొరికే అవకాశం కూడా ఉంటుందని బ్రాడ్ చెప్పాడు. నిజానికి బెన్ స్టోక్స్ ది హండ్రెడ్ లీగ్ సమయంలో నార్తర్న్ సూపర్‌ఛార్జర్స్ తరపున ఆడుతున్నాడు. అతను ఒక మ్యాచ్ సమయంలో స్నాయువు గాయంతో బాధపడ్డాడు. ఆ తర్వాత అతను క్రచెస్ సహాయంతో నడుస్తూ కనిపించాడు. స్టోక్స్ గాయం నుండి తిరిగి రావడానికి చాలా సమయం పట్టలేదు. చివరిసారి అతను గాయం కారణంగా ఖూా 2024 నుండి తప్పుకోవాల్సి వచ్చింది. ఆ తర్వాత స్టోక్స్ మళ్లీ గాయానికి గురయ్యాడు. అయితే ఇటీవల కాలంలో స్టోక్స్ గాయాల కారణంగా ఇబ్బంది పడుతున్న విషయం తెలిసిందే. ఈ కారణంగానే ఐపీఎల్ 2024కు కూడా దూరమైన విషయం తెలిసిందే.

